# చేదు నిజం

**– అడపా రామకృష్ణ**

**మే నెల. వేసవి కాలం. ఎండలకీ, వేడి గాడ్పులకీ ముచ్చెమటలు పోస్తూ మలమల మాడి పోతున్నారు ఆఫీసులో సిబ్బంది. గుమస్తాలు, టైపిస్టులు, యితరత్రా స్టాఫ్ మరీ ఉసూరు మంటుంటే అదే కంపెనీలో ఒక మూరు మూల ఆఫీస్ ఛాంబర్‌లో ఎయిర్ కండిషన్డ్ పూర్తి స్థాయిలో అత్యంత చల్లదనాన్ని దిల్‌ఖుష్‌గా ఆరాం సే అనుభవిస్తున్నాడు చీఫ్ మేనేజర్ హోదాలో దినకర్.**

విమల్ షోరూంలో మేకప్ మన్‌లా ఖరీదైన దుస్తుల్లో టిప్‌టాప్‌గా ఠీవి ఒలకబోస్తున్నాడు దినకర్. నలభై అయిదు దాటిందేమో వయసుకు తగ్గట్టు కళ్ళకు బైఫోకల్ గోల్డ్ ఫ్రేమ్ తగిలించాడు. టేబిల్ టాప్ మీద చేతులు ఆనించి అతి శ్రద్ధగా కంపెనీ తాలూకూ లోకల్ పర్చేజ్ ఫైల్ రిఫర్ చేస్తున్నాడు.

గది నిండా పరుచుకున్న ఎర్రటి తివాచీ ఆఫీసరు కాలి కింద తొక్కిడికి మరింత నలిగి రంగు తగ్గింది. సీలింగ్‌కు అతుక్కు పోయి తిరుగుతున్న ఫ్యాను దీపావళి పండగలో పిల్లలు కాల్చుకునే విష్ణు చక్రంలా వుంది. నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ గోడ గడియారం టిక్ టిక్‌మని మంటూ తన ఉనికిని తెలుపుతోంది. గోపీ రంగు వేసిన గోడ మీద ఒక పక్క గాంధీ, దాని కెదురుగా స్వామి వివేకానంద ఫొటో. వాళ్ళేం చెప్పారో ఏమో, మేం ఏం చేస్తున్నామో అది మాత్రమే తిలకించండి అని చెప్పి మరీ గోడకి తగిలించినట్లున్నారు. అందుకే మరి చీఫ్ మేనేజర్ దినకర్ ఆస్తులు, అంతస్తులు దినదినాభివృద్ధి చెందుతూనే వున్నాయి. సిటీ సెంటర్‌లో త్రీ బెడ్రూమ్ అపార్ట్‌మెంట్ తీసుకున్నాడు. షేర్ మార్కెట్‌ను ఏ రోజు కారోజు కనిపెడుతూ ధర పడిపోతున్న వాటిని సేల్ చేస్తూ వెనువెంటనే కొత్త షేర్స్‌ను కొంటూ అధిక లాభాలు ఆర్జిస్తూనే వున్నాడు. ప్రతి రూపాయి ఖర్చునుంచి మరో పది రూపాయలు లాభం ఎలా రాబట్టు కోవాలో బాగా తెలిసిన వాడు. ఇంట్లో భార్యకు, ఒక్కగా నొక్క కొడుక్కీ అదే తర్ఫీదు. ఉన్న ఉద్యోగంలో అవకతవకలు చేస్తున్నాడని గోడకు మేకు కొట్టినట్లు ఒక చోట కట్టి పడేశారు. అయినా నెల జీతాలు వస్తూనే వున్నాయి. షేర్ మార్కెట్ టర్నోవర్ ఆగిపోలేదు. బ్యాంక్ బేలన్స్ తగ్గిపోనూ లేదు.

స్ప్రింగ్ డోర్ కీచుమని చప్పుడు చేస్తే తలపైకి ఎత్తి "ఎస్ కమిన్" అన్నాడు రివాల్వింగ్ ఛేర్‌లో కొద్దిగా ఊగుతూ దినకర్.

గుమస్తా నారాయణ లోనికి వస్తూ "గుడ్ మార్నింగ్ సార్" అంటూ ఎంతో మర్యాదగా విష్ చేశాడు.

"ఏం పని" అన్నట్లు క్వశ్చన్ మార్క్ ఫేస్ పెట్టాడు దినకర్ చిరాకుగా

"సార్! సర్కార్ టూల్స్ అండ్ హెవీ మిషన్ కంపెనీ డీలర్ వచ్చాడు. మిమ్మల్ని చూడాలట" అన్నాడు.

"సరే! పంపించండి, బైదిబై, ఈ ఫైల్ క్లియర్ చేశాను, డిస్పాచ్ చేయండి" అంటూ ఫైల్ మూసి అవుట్‌ట్రేలో పడేశాడు. అది అందుకొని నారాయణ మెల్లగా "ఎక్స్‌క్యూజ్‌మీ సార్" అంటూ గొణిగాడు నెమ్మదిగా. ఆఫీసరు కనుబొమ్మలు పైకి ఎగరేస్తూ ఏం కావాలన్నట్లు ఛైర్ వెనక్కు జరిపాడు.

"మీ పర్మిషన్ తో లీవ్ ట్రావెల్ కన్సెషన్ డ్రా చేద్దామనుకుంటున్నాను సార్" మెల్లగా నసిగాడు నారాయణ.

"ఎల్టీసీ, రియల్లీ ట్రావెల్, ఆర్ జస్ట్ మేనేజ్" ఒక చురక అంటిస్తున్నట్లే అనుమానాస్పదంగా అడిగాడు. అదేమిటో ఆఫీసుల్లో ఆఫీసర్లంతా ప్రతి మాటను ఆంగ్ల భాషలో ఉచ్ఛరిస్తే గానీ అసలు మాట్లాడినట్లుండదని అపోహలా వుంది.

జవాబుగా, "రియల్లీ సార్. కానీ, మీతో ఒక మాట చెప్పి..." ఉత్సాహంగా ఏదో చెబుతున్న నారాయణని దినకర్ మధ్యలోనే తుంచేస్తూ "ముందు అక్కడ పైన వెయిట్ చేస్తున్న డీలర్ని పిలవండి, మీ ప్రపోజల్ తరువాత డిస్కస్ చేద్దాం, తొందరేం లేదు" అన్నాడు కొంచెం అయిష్టతని ముఖంలోకి తెచ్చుకుంటూ.

అకస్మాత్తుగా ఫ్రిజ్ వాటర్ తీసి ముఖం మీదకు దిమ్మరించినట్లనిపించింది నారాయణకు. అసహనంగా వెనక్కు తిరిగాడు అంతకన్నా మరో మార్గం తోచక.

సర్కార్ కంపెనీ డీలర్ లోనికి వచ్చాడు. "ప్లీజ్ బి సీటెడ్" అంటూ దినకర్ తనకెదురుగా వున్న కుర్చీలో కూర్చోమని సైగ చేశాడు.

సడన్‌గా ఒంటికి తగిలిన ఏసీ ప్రభావం వల్ల కొంచెం యిబ్బంది ఫీల్ అవుతూ కూర్చున్నాడు.

బెల్ కొట్టి టీ తెప్పించాడు. చెరొక కప్పు తాగారు. "మీ డిమాండ్‌కి కొటేషన్ ఫ్లో చేశాను చూశారా?" అన్నాడు డీలర్ తాపీగా.

"హైడ్రాలిక్ ఇంజన్ పార్ట్ దేనా? చూశాను. వాట్ హెవీ, అరవై వేలు కోట్ చేశారు. ఈజిట్ కరెక్ట్?" విసురుగా రివాల్వింగ్ ఛెయిర్ వెనక్కు జరుపుకొంటూ అడిగాడు.

డీలర్ కొంచెం తడబడ్డాడు – "అది కాదు సార్! మీ మార్జిన్ కమిషన ఇరవై వేలు పోతే, చెక్కు ఇష్యూ అథార్టీ ఆడిటర్స్‌కి ఇరవై శాతం యివ్వాలి. బిల్లు పాసవదు. మా ప్రాబ్లమ్స్ మాకుంటాయి. మీకు తెలియంది కాదు. అదీ గాక ఈ పార్ట్ వెరీ రేర్ అయిటమ్. ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా రప్పించాలి" డీలర్ తన కష్టాలన్నీ ఏకరువు పెట్టుకున్నాడు. ఆఫీసరు ఏ మాత్రం అయినా కరిగి తనకే ఆర్డర్ ప్లేస్ చేస్తాడని.

డీలర్ అంత నిక్కచ్చిగా మాట్లాడాడంటే చాలా కాలంగా ఎన్నో పార్ట్స్, కావలసిన కెమికల్స్ సప్లై చేస్తూ ఎంతో కొంత కమిషన్ సమర్పిస్తూనే వున్నాడు

దినకర్ సీరియస్‌గా ఏ మాత్రం లొంగకుండా తల అడ్డంగా తిప్పుతూ "మీ కొటేషన రిజెక్ట్ చేస్తున్నాను. ఐ కాంట్ హెల్ప్" అన్నాడు నిర్మొహమాటంగా.


"ఒకె సార్. లాస్ట్ వర్డ్. టేకిట్ గ్రాంటెడ్. మీ పర్సనల్ మార్జిన్ అమౌంట్ ఇరవై అయిదుకి కన్‌ఫర్మ్ చేస్తున్నాను. మాది ఓకే చేయండి." అంటూ మరో మాటకు అవకాశం యివ్వకుండా లేచిపోయాడు.

అతను అటు అలా వెళ్ళగానే ఇంటర్‌కమ్‌లో గుమస్తా నారాయణని పిలిచాడు.

ఛాంబర్ లోకి రాగానే– "చూడండి, సర్కార్ కొటేషన్ తీసి శాంక్షన్ టైప్ చేసి రెడీ చేయండి" అన్నాడు చురుగ్గా.

జవాబుగా తల ఊపుతూ అక్కడే నిల్చున్నాడు నారాయణ.

"ఆ! చెప్పండి. ఎల్టీసీ అంటున్నారు. ఈ బ్లాక్‌ఇ



యర్ వాడ లేదా? అయితే వెళ్లిరండి" అన్నాడు మరో వైపు ధ్యాస మళ్ళిస్తూ.

దివకర్ అంత క్యాజ్‌వల్‌గా మాట్లాడటం గమనించి మూడ్ బాగుందని నారాయణ్కొ కొంచెం ధైర్యం చేశాడు.

"సార్! మీ హెల్ప్ కావాలి. మా ఫ్యామిలీకి ఆగ్రా, ఢిల్లీ, ఎప్పట్నించో తాజ్ మహల్ చూడాలన్న కోరిక వుంది. నాకిప్పుడు ఫస్ట్ క్లాస్ ఎలిజిబిల్టీ వచ్చింది. రాను పోనూ పది వేలు వస్తుంది. సెకెండ్ క్లాస్‌లో పోతే నాలుగు వేలతో సరిపెట్టకోవచ్చు. మీరు పర్మిషన్ ఇస్తే..." మధ్య తలరగతి బతుకుల్లో చాలీ చాలని జీతాలతో అందుబాటులో లేని కోర్కెల్ని తీర్చుకోవడానికి పడరాని పాట్లు ఎలావుంటాయో నారాయణ ముఖంలో ద్యోతక మవుతోంది.

ఆఫీసర్ దివకర్ ముఖం చూసి ఆగాడు. గొంగళి పురుగును చూస్తున్నట్లున్నాయి అతని కళ్ళు. చేతిలో కలం పెన్ స్టాండ్‌లో పెట్టకుండా గ్లాస్ టాప్ మీద కోపంగా వడేస్తూ "మిస్టర్ నారాయణ! స్టాప్ నాన్సెన్స్! సెన్స్ వుండే మాట్లాడుతున్నారా? బతుకు తెరువు చూపే ఈ కంపెనీనే చీట్ చెయ్యాలనుకుంటున్నారా? మీలాంటి వాళ్ళుండబట్టే దేశంలో కంపెనీలన్నీ నష్టాలతో నడవలేక మూతపడుతున్నాయి. ఈ బుద్ధి మీకే పుట్టిందా? లేక ఇంకా ఎవరేనా ఈ స్కామ్‌లో వున్నారా? ఊ! చెప్పండి. అయికాంట్ టాలరేట్ సచ్ కైండ్ ఆఫ్ ఛీటింగ్" అంటూ దినకర్ ఉగ్ర రూపం దాల్చాడు. ఏసీ రూమ్‌లో నారాయణకు ముచ్చెమటలు పోశాయి. గొంతు పిడచకట్టుకు పోయింది. మౌనంగా వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

నెల రోజులు గడిచింది. దినకర్ ఎన్నో ప్లాన్‌లు వేసుకున్నాడు. పాతిక వేలు చేతికి ముట్టగానే షేర్ మార్కెట్‌లో జోరుగా చలామణీ అయ్యే కంపెనీలో పెట్టుబడి పెట్టాలని, అతి తక్కువ టైమ్‌లో నాలుగు రెట్లు అయ్యే అవకాశాల కోసం ఎదురు చూడసాగాడు.

సర్కార్ డీలర్ నుంచీ ఫోన్ కాల్‌గానీ, మెసేజ్ కానీ రాక పోవడంతో కంగారు ఎక్కువైంది. ఫోన్ మీద ఋఫోన్ చేయగా లక్కీగా కనక్ట్ అయ్యింది.

"హల్లో! హియర్ దినకర్ స్పీకింగ్."

"ఎస్ ప్లీజ్, సర్కార్ కంపెనీ డీలర్ హియర్."

"వాట్ హేపెండ్ దట్ సప్లై అయిటమ్?"

"వెరీ సారీ సర్, మీ డీల్ కాన్సిల్ చేసుకున్నాం."

అది విని రక్తం ఉడికి పోయింది దినకర్‌కి

"వాట్‌జ్ ద రీజన్, టెల్మీ" కసురుకుంటున్నట్లు అరిచాడు. పాతిక వేలు కళ్ళ ముందే ఒక వెలుగు వెలిగి మాయమవుతున్నట్లు అనిపించింది.

మీ డిమాండ్ ఐటమ్ ఢిల్లీ నుంచి పెర్సనల్ కస్టడీలో తేవాలి సార్. వేరేగా తేవాలంటే బోల్డంత ఖర్చు"

"అలాగే రప్పించండి. ప్రాబ్లమ్ ఏమిటి?"

"మా ఫ్రెండొకరు ఢిల్లీ వెళ్తున్నారంటే ఫర్వాలేదనుకున్నాం. తీరా లాస్ట్ మినిట్‌లో అతని ప్రోగ్రామ్ కాన్సిల్ అయింది"

"మీ ఫ్రెండ్‌కి వచ్చిన ట్రబుల్ ఏమిటి?"

"సారీ సర్. అతనికి లీవు దొరక లేదు. వాళ్ళ డిపార్ట్‌మెంట్ వాళ్ళు స్పేర్ చేయలేదు. ఏం చేయమంటారు?"

"ఏ డిపార్ట్‌మెంట్ వాళ్ళది? నేను మాట్లాడతాను, ఆయన పేరు చెప్పండి" ఆత్రుతగా అడిగాడు దినకర్.

"అదే సార్.మీ డిపార్ట్‌మెంటే. ఢిల్లీ వెళ్ళ వలసిన వ్యక్తి నారాయణ. మీ ఆఫీసు గుమస్తా?" అన్నాడు. అవతలి వ్యక్తి ఫోన పెట్టేయగానే దినకర్ తల గిర్రున తిరగింది. కంపెనీ సొమ్ము దోచుకుంటున్నానని మందలించిన తను కంపెనీకి కొనే సరుకులో పాతిక వేలు కమిషన్ కొట్టేయాలన్న విషయం లోయర్ గ్రేడ్ గుమస్తాకి తెలిసి పోయిందన్న నిజం... ఆ చేదు నిజాన్ని భరించలేక జుట్టు పీక్కుంటున్నాడు దినకర్.